ఇల వైకుంఠం

● పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ





8లో

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయానికి ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ

శ్రీదేవి, భూదేవి సమేత స్వర్ణరథంపై ఊరేగుతున్న మలయప్పస్వామి

రేపు తిరుపతికి సీఎం

● నాలుగు రోజులపాటు జిల్లాలో ఉండనున్న చంద్రబాబు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్ - 8లో



తిరుమలలో ఎర్రచందనం పట్టివేత

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఎర్రచందనం పట్టుబడింది. తిరుమల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులు శుక్రవారం వేకువజాము తిరుమలలోని గోగర్భం డ్యాం వద్ద నిఘ పెట్టారు. ఓ కారు ఉదయం 7 గంటల సమయంలో వస్తుండగా ఫారెస్ట్ సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేశారు. వీరిని గమనించిన ముగ్గురు స్మగ్లర్లు కారు నిలిపివేసి అడవిలోకి పారిపోయారు. ఫారెస్ట్ సిబ్బంది వారిని వెంటాడినా ఆచూకీ లభించలేదు. ఇక, కారును పరిశీలించగా 6 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతో సహా దుంగలను తొలుత తిరుమలలోని ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించి ఆతర్వాత తిరుపతికి పంపారు.

ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ

తిరుపతి (నేరవిభాగం): జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును నియమించారు. ఎస్పీ సుబ్బరాయుడు బదిలీ అయిన విషయం తెలిసిందే.





అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన వీఐపీలు

తిరుచానూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం సుప్రభాతసేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొలిపి మూలవర్లకు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు కేటీ మండపంలో భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం నుంచి రాత్రి వరకు వీఐపీల తాకిడి పెరిగింది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమ రాజు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పలువురు నాయకులు, హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెం డెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్ నాయుడు, చలపతి పాల్గొన్నారు. కాగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో కుంకుమార్చ, వీఐపీబ్రేక్, అభిషేక అనంతర దర్శనం వంటి ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



చిట్టేచర్లలో విశేష అలంకరణలో వెంకటేశ్వర స్వామి

భాకరాపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు ఆలయాలలో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిట్టేచెర్ల పంచాయతీలో కొలువైన లక్ష్మీప్రసన్న అభయ హస్తపు వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాలు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే దేవరకొండ వేంకటేశ్వర స్వామి, నెమలిగుండ్ల వెంకటేశ్వర స్వామి, చెరువు ముందరపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

పాకాల: మండలంలోని వైష్ణవ ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాకాల రైల్వే కాలనీలో కోదండ రామాలయం, పెద్దగోర్పాడు రామాలయం, దామల చెరువు కోదండస్వామిఆలయం, వల్లివేడు రామాలయం, శంఖంపల్లె ఆంజినేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేంద్రగుంట వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఏర్పాటు చేసిన వైకుంఠద్వారంలో ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేశారు. ఆయా ఆలయాలలో ప్రత్యేక పుష్పాలతో అలంకరణలు చేశారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

తిరుపతి(సెంట్రల్)జనవరి10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో రూ.300 కోట్లతో జరుగుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పనులు పూర్తి చేయాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శుక్రవారం రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు జరుగుతున్న భవన నిర్మాణాలు, ఎయిర్ కాన్ కోర్స్ పనులు, ఇతర అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో అభివృద్ధి పనులపై కార్యాలయంలో సమీక్షించారు. జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ స్కేల్ అధికారులు, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్‌ఎంఆర్ డాక్టర్ కె.చిన్నప్పరెడ్డి, డిప్యూటీ సీఈ ఉపేంద్ర కుమార్, ప్రభాకర్, మాధవరావు, సంజయ్, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం

తిరుపతిరూరల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది తిరుపతిని ఆదర్శజిల్లాగా తీర్చిదిద్దుకుందామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీఎస్ శోభన్‌బాబు తెలిపారు. రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో వయోజనవిద్య, వెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని ఏపీఎంలకు ఒకరోజు శిక్షణ(ఉల్లాస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రామచంద్ర, వయోజనవిద్యాశాఖాధికారి ప్రసాద్, విజయ, చంద్రబాబు, పత్తిపాటి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

గోకులాలు పాడి రైతులకు వరం: నాని



గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులాలు పాడి రైతులకు వరం లాంటివని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీ వంగుమళ్లవారిపల్లెలో మినీ గోకులాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలానికి రూ.4 కోట్లతో 179 మినీ గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పాడి రైతులు తమ పశు సంపదను వర్షం, ఎండ బారి నుంచి సురక్షితంగా కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, ఏపీడీ చిన్నరెడ్డెప్ప, ఉద్యాన అధికారి శివకుమారి, వెటర్నరీ అధికారి స్రవంతి, ఏపీవో భార్గవి, టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ విజయ కుమారి, నాయకులు ఆర్వీ రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రమణ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలు

తిరుపతి(ఆటోనగర్) జనవరి10 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని ఎస్‌ఎస్‌బీ కల్యాణ మండపంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని ఆ సంఘం డిస్కం కార్యదర్శి ఎల్.చలపతి తెలిపారు. డిస్కం పరిధిలో ఉన్న సంఘం సభ్యులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్రంలోని సంఘం నాయకులు, డిస్కం నాయకులు హాజరవుతారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. అలిపిరి, స్విమ్స్, పాలిటెక్నిక్, ఈస్ట్ సెక్షన్ల పరిధిలో సుందరయ్య నగర్, రైల్వే కాలనీ, టీటీడీ ఏడీ బిల్డింగ్, శివజ్యోతినగర్, భూపాల్‌నగర్, విజయపురం, క్రాంతినగర్, జర్నలిస్ట్ కాలనీ, ఎర్రమిట్ట, రాజీవ్‌నగర్, ఎమ్మార్ పల్లి, మునిరెడ్డి నగర్, శ్రీకృష్ణ నగర్, పీవీ నగర్, వైకుంఠపురం, మారుతీనగర్, వెస్ట్‌చర్చి రోడ్డు, బైరాగిపట్టెడ, తుడ కార్యాలయ ప్రాంగణం, బీఎస్‌ఎల్ కార్యాలయం పరిసరాలు, పాత తిరుచానూరు రోడ్డు, అవిలాల మెయిన్ రోడ్డు, తిరుచానూరు, యోగిమల్లవరంలో సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీ, వివేకానంద సర్కిల్, మారుతీనగర్, కేటీ రోడ్డు, వరదరాజనగర్, అలిపిరి రోడ్డు, డిఫెన్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లోనూ అంతరాయం ఉంటుందని తెలిపారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

వాకాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్రతీరంలో గల్లంతైన విద్యార్థి మామిడి లోకేష్(17) మృతదేహం శుక్రవారం సాయంత్రం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. వాకాడు మండలం వైట్‌కుప్పం గ్రామానికి చెందిన విద్యార్థి మామిడి లోకేష్ స్నేహితులతో కలసి గురువారం సముద్ర స్నానానికి వెళ్లగా లోకేష్‌తో పాటు మరో విద్యార్థి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం నుంచి సముద్రతీరంలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 6 గంటలకు ఓ మృతదేహం నీటిపై తేలియాడుతూ ఒడ్డుకు చేరుకోగా అది లోకేష్‌దిగా గుర్తించారు. నెల్లూరు జిల్లా కావలి ప్రాంతం బంగారుపాళెం గ్రామానికి చెందిన కొండయ్య, రేఖ దంపతుల కుమారుడు లోకేష్‌గా గుర్తించారు. ఇతడు వైట్‌కుప్పంలో మేనమామ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు.

మరణంలోనూ వీడని బంధం

● భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య మృతి




సుబ్బరామయ్య, శేషమ్మ (ఫైల్‌ఫొటోలు)

కోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం కలిసి ఉంటామంటూ వివాహ బంధంతో ఒక్కటైన జంట కాటికెళ్లే సమయంలో కలిసే ప్రయాణించిన ఘటన కోట మండలం తిన్నెలపూడి దళితవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని తిన్నెలపూడి దళితవాడకు చెందిన మన్నె సుబ్బరామయ్య (80), శేషమ్మ(75) దంపతులకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు ఆర్టీసీలో కండెక్టర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బరామయ్య గురువారం స్వగ్రామమైన తిన్నెలపూడిలో మృతి చెందాడు. శుక్రవారం దహన క్రియలు నిర్వహిస్తుండగా భర్త మృతదేహంపై పడి భార్య శేషమ్మ బోరున విలపిస్తూ అశువులు బాసింది. ఈ ఘటన బంధువులు, గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య ఒకేసారి భార్యభర్తల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

ఎర్రావారిపాళెం, జనవరి10 (ఆంధ్రజ్యోతి) ; మండలంలోని ఉదయమాణిక్యం రెవెన్యూ గ్రామ వీఆర్వో హరినాథపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ పరమేశ్వరస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఎరుకలపల్లెకు చెందిన రైతులు 13 /22 కృష్ణసాగర్ చెరువు పోరంబోకు 72 ఎకరాల భూమిని సాగుచేసుకొంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు అగ్రవర్ణాల వారు కూడా సాగు చేసుకుంటున్నారని వివరించారు. అయితే ఎరుకుల కులస్తులను సాగు చేసుకోనీయకుండా వీఆర్వో అడ్డుకుంటున్నాడని తెలియజేశారు. సమస్య పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దనాసి వెంకట్రామణ, చంద్ర, రమణయ్య, రమణయ్య, విశ్వనాథ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

తిరుచానూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు ఏవో ఖాదవల్లి తెలిపారు. శుక్రవారం శిల్పారామంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంక్రాంతి సంబరాల కరపత్రాలను ఆవిష్కరించారు.

నేడు చక్రస్నానం

తిరుచానూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం 7.30 నుంచి 8 గంటల మధ్య చక్రస్నానానికి టీటీడీ ఏర్పాట్లు చేసింది.

కిక్కిరిసిన శ్రీనివాస ఆలయం

తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న శ్రీనివాస ఆలయంలో ఫల, పుష్పాలతో ఆలయంలో ఉత్తర ద్వారాన్ని అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఉత్తరద్వార ప్రవేశం చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి, అర్చకులు పాల్గొన్నారు. ● యోగి మల్లవరంలో సాలిగ్రామ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త దినేష్ అన్నదానం చేశారు.

ఫారెస్టు బీట్ అధికారిపై దౌర్జన్యం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఫారెస్టు బీట్ అధికారి సురేష్‌బాబుపై దౌర్జన్యం చేసిన ఘటనలో అలిపిరి పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. అలిపిరి ఏఎస్‌ఐ అబీబుల్లా కథనం మేరకు... మంగళం కూరపాటి లేఅవుట్‌కు చెందిన కె.రాధాకృష్ణ తిరుమలలోని ఫారెస్టు స్థలంలో అనధికారికంగా రేకుల షెడ్డు వేసుకుని దుకాణం నడుపుతున్నాడు. బీట్ అధికారి సురేష్‌బాబు దాన్ని తొలగించారు. ఈ విషయమై రాధాకృష్ణ సురేష్‌బాబుపై దౌర్జన్యం చేసి, కొట్టడానికి ప్రయత్నించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు




వైకుంఠ వాకిలి దర్శనం తర్వాత వెలుపలికి వస్తున్న భక్తులు, ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. తిరుమల శ్రీవారి ఆలయ తరహాలో వైకుంఠ ద్వార ప్రవేశం ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో శుక్రవారం వేకువజామున 12.05 నుంచి 2.30 గంటల స్వామివారిని మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వదర్శనంతో పాటు వైకుంఠ ద్వారాన్ని ప్రారంభించారు. దీంతో శ్రీనివాసమంగాపురం ఉదయం నుండే భక్తులతో కిక్కిరిసిపోయింది. వైకుంఠ ద్వార దర్శనం ఏకాదశి, ద్వాదశి రెండు రోజులు ఉంటుంది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఆలయంలో స్వామిఅమ్మవారి ఉత్సవర్లను శోభయమానంగా అలంకరించి బంగారు తిరుచ్చిపై అధిష్ఠింపజేసి ఆస్థానం నిర్వహించారు. భక్తులకు తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐలు అనిత, రవీంద్రనాయక్ బందోబస్తు నిర్వహించారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో...

శ్రీవారి మెట్టు మార్గంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి చందనాలంకరణ చేశారు.

ఓవరాల్ చాంప్ ఎస్వీవెటర్నరీ కళాశాల

● వ్యక్తిగత ఓవరాల్‌చాంపియన్లుగా విజయ్, సాయితేజస్విని

● వెటర్నరీలో ముగిసిన అంతర కళాశాలల క్రీడా పోటీలు



ఓవరాల్‌చాంపియన్ ట్రోఫీతో విద్యార్థులు, వీసీ, డీఆర్, ఇతర అధికారులు

తిరుపతిరూరల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీవర్సిటీ వేదికగా ఈ నెల 6నుంచి ఐదురోజుల పాటు నిర్వహించిన 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్యపోటీలు శుక్రవారంతో ముగిశాయి. వర్సిటీపరిధిలోని నాలుగు వెటర్నరీ కళాశాలలు, ఒక డెయిరీ టెక్నాలజీతో కలిపి ఐదు కళాశాలలకు చెందిన విద్యార్థులు పలు క్రీడాపోటీల్లో తలపడగా.. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, చెస్‌పోటీలలో ఆతిథ్య ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి మహిళల, పురుషుల ఓవరాల్ చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నారు. వ్యక్తిగత విభాగంలో తిరుపతి వెటర్నరీ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్.విజయ్ వ్యక్తిగత చాంపియన్ షిప్‌ని సాధించగా.. ఓవరాల్ వ్యక్తిగత చాంపియన్ షిప్‌ని ప్రొద్దు టూరుకు చెందిన విద్యార్థి ఎం.సాయితేజస్విని సొంతం చేసుకున్నారు. వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతి రామయ్య అధ్యక్షతన సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీరమణ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీన్లు ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావులు హాజరై వివిధ విభాగాల్లో విజేతలుగా నిలచిన వారికి ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జేవీ రమణ మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, శ్రీలత మాట్లాడుతూ క్రీడలలో భాగస్వామ్యంతో సాధించిన మానసికవికాసం ద్వారా చదువులోనూ మంచిగా రాణించాలని ఆకాంక్షించారు. వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని కళాశాలలో మెరుగైన క్రీడామైదానాలు, పరికరాలు సమకూర్చుతామని, క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని ఆకాంక్షించారు. అలాగే సాంస్కృతిక, సాహిత్య పోటీలలో ప్రతిభచాటిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఓఎస్‌ఏ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జయచంద్ర, ఫిజియాలజి హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య, డాక్టర్ స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో వేడుకగా వైకుంఠ ఏకాదశి



తిరుపతిరూరల్, జనవరి10(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణలతో వైకుంఠద్వార ప్రవేశం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో వివిధపుష్పాలతో ఆలయంతో పాటు వైకుంఠ ద్వారాన్ని అలంకరించారు. వైకుంఠద్వార దర్శనం కోసం శుక్రవారం తెల్లవారుజామున 2గంటల నుంచి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. కాగా ఆలయం ముందు ఏర్పాటు చేసిన కళావేదికపై విజయవాడకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అన్న మయ్య సంకీర్తనలు భక్తులను కనువిందు చేశాయి. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● **పుదిపట్లలో:** పుదిపట్లగ్రామంలోని పురాతన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి భజనమందిరంలో ఉత్తర ద్వార ప్రవేశానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సర్పంచ్ బడిసుధాయాదవ్ నేతృత్వంలో ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను చేశారు. ఎంపీటీసీ శ్రీకాంత్, ఉప సర్పంచ్ రేవతి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు, రేపు పుస్తక ప్రదర్శన సగం ధరలకే విక్రయం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శని, ఆదివారం రెండు రోజులపాటు జరిగే పుస్తక ప్రదర్శలో సగం ధరకే పుస్తకాలను విక్రయించనున్నారు. ఈ ప్రదర్శనలో తెలుగు, ఆంగ్లం కవిత్వం, కథా సంపుటాలు, నవలలు, జీవిత చరిత్రలు, జి.కె.వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య, ఆధ్యాత్మిక పుస్తకాలు లభిస్తాయి. ప్రకాశం రోడ్‌లోని ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ ఎదురుగా ప్లాట్‌ఫామ్‌పై సాయంత్రం 4గంటల నుంచి 8వరకు పుస్తక ప్రదర్శన ఉంటుంది. విజ్ఞానం తరగని ఐశ్వర్యం, ముఖ్యంగా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ అపూర్వ అవకాశాన్ని వినియోగించుకోవాలని రచయితల సంఘం అధ్యక్షులు సాకం నాగరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉద్యానవన వెంకన్న సన్నిధిలో ఆర్‌ఆర్‌ఆర్

తిరుపతి, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక ఎల్‌ఎస్ నగర్‌లోని ఉద్యానవన వెంకటేశ్వర స్వామిని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో గౌరవించారు. ఉప సభాపతికి స్వాగతం పలికినవారిలో కార్పొరేటర్ నరసింహాచారి, తిరుపతి పార్లమెంటు తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి రూపేష్ వర్మ పాల్గొన్నారు.

తిరుపతి-మచిలీపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జనవరి 10(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి తిరుపతి-మచిలీపట్నం మధ్య నాలుగు ప్రత్యేక రైళ్ళు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైలు(07121) ఈ నెల 12, 19 తేదీల్లో తిరుపతి నుంచి మచిలీపట్నంల మధ్య రాకపోకలు నిర్వహిస్తుంది.

● మచిలీపట్నం-తిరుపతిల మధ్య ఈ ప్రత్యేక రైలు(07122) ఈ నెల 13, 20 తేదీల్లో రాకపోకలు నిర్వహిస్తుంది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం

చంద్రగిరి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను సానుకూలంగా విని ఆ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

తిరుపతి (జీవకోన), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదు వస్తే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తప్పవన్నారు. వాహనాలకు పూర్తిస్థాయిలో రికార్డులు ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా తిప్పితే సీజ్ చేస్తామని అన్నారు. పది రోజుల పాటు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడపరాదని, తనిఖీల్లో పట్టుపడితే తీవ్రమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి: కొండా సురేఖ

● ఎంబీయూలో ఘనంగా 32వ స్పోర్ట్ డే వేడుకలు

● అబ్బుర పరిచిన సాంస్కృతిక కార్యక్రమాలు

చంద్రగిరి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని తెలంగాణా మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఎ.రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో 32వ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విచ్చేశారు. ఎంబీయూ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్ బాబు, ప్రొ చాన్స్‌లర్ మంచు విష్ణు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్పోర్ట్స్ డే జెండాను ఆవిష్కరించి, క్రీడా జ్యోతిలను వెలిగించారు. ఎంబీయూ విద్యార్థులు నత్యాలను ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృత కార్యక్రమాలు అలరించారు. క్రీడాపోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు మోహన్ బాబు, కొండా సురేఖ. మంచు విష్ణులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు నాగరాజ రామారావు, వీసీ కరుణా కిరణ్, రిజిస్ట్రార్ సారథి, డీఎఫ్‌వో రవిశేఖర్, ఇతర ఆధ్యాపకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫ్రెషర్స్ డే

మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫ్రెషర్స్ డే వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హాజరయ్యారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





ముఖ్య అతిథులుగా విచ్చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, మంత్రి కొండా సురేఖ, చిత్రంలో మోహన్‌బాబు, విష్ణు, ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



రిమ్స్‌లో సంక్రాతిసంబరాలను ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, విద్యార్థుల కోలాటాలు

తిరుపతిరూరల్/ విద్య, జనవరి10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పలు విద్యాలయాల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు.

● **రిమ్స్‌లో:** బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (రిమ్స్) కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగిమంటలు వేసి.. కోలాటాల నృత్యం ప్రదర్శించి..గొబ్బిపాటలుపాడి సందడి చేశారు. సంక్రాంతిలక్ష్మిని కొలువుదీర్చి కొత్తకుండలలో పొంగలి తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సెక్రటరీ వై.ఆనందరెడ్డితో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి కలిసి పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెడ్లు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, పి.మధుర, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **ఎస్వీసీఈలో:** కరకంబాడిరోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో హరివిల్లు పేరిట సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ ఆటలు ఆడి.. జానపదగీతాలను ఆలపించి సందడి చేశారు. కాలేజీ ప్రాంగణాన్ని అందమైన ముగ్గులతో తీర్చిదిద్ది భోగిమంటలు వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ● **లిటిల్‌ఏంజెల్స్‌లో:** యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. భోగిమంట వేశారు. స్కూల్ ఛైర్‌పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ డాక్టర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ పాల్గొన్నారు.

తొక్కిసలాటకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్ కౌంటర్ల వద్ద జరిగిన తొక్కిసలాటకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తిరుక్షేత్రాల రక్షణ కమిటీ సభ్యుడు తుమ్మ ఓంకార్ డిమాండ్ చేశారు. హిందూ రక్షణ కోసం పనిచేసే నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి దర్శనాల కోసం వచ్చిన భక్తులకు సరైన రక్షణ కల్పించలేదన్నారు. క్యూలైన్ల నిర్వహణ లోపభూయిష్టంగా మారిందన్నారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడం కాదని, ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని అన్నారు.

జగన్ ఇంకా మారలేదు

పరామర్శ పేరుతో స్విమ్స్‌ను ముట్టడించిన వారిపై చర్యలు తీసుకోవాలి
జనసేన నేత కిరణ్‌రాయల్ డిమాండ్


మీడియాతో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ఇంకా మారలేదని, వైకుంఠ ఏకాదశి దర్శన క్యూలైన్ల వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలను, గాయపడిన వారిని పరామర్శించే క్రమంలో ఆయన వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనమని జనసేన నేత కిరణ్ రాయల్ అన్నారు. పద్మావతి మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రి వద్ద వైసీపీ గూండాలతో శవ రాజకీయాలు చేయడం ఆయనకే సాధ్యమైందని దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ గాయపడిన వారిని పరామర్శించే పేరుతో ఆస్పత్రిలోకి వైసీపీ నేతలు గుంపులుగా వెళ్లడంతో అక్కడి రోగులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఆస్పత్రి లోపల సెల్ఫీలు దిగడమేమిటని ప్రశ్నించారు. జై జగన్ నినాదాలు చేయడం సిగ్గు చేటన్నారు. పోలీసు వ్యవస్థలో ఇంకా జగన్ వాసన పోలేదని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో హేమకుమార్, కిషోర్, హేమంత్, పురుషోత్తం, సాయిదేవ్, మనోజ్, షరీఫ్, సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



తిరుపతి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం విష్ణునివాసం వద్ద శ్రీసిద్ధి వినాయక ట్యాక్సీ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బిల్లా హరినాథ్, కార్యదర్శి వావిలాల రామరాజు, జె.బి.బాలాజీ పాల్గొన్నారు.

లాడ్జీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



తిరుపతి (జీవకోన): రైల్వేస్టేషన్ సమీపంలో లాడ్జీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సద్దా సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యుగంధర్, ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రవి, రాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు..

తిరుపతి అర్బన్: వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో గాయాలపాలైన భక్తులకు స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో శుక్రవారం జనసేన నేత మధుబాబు అన్నదానం చేశారు.

క్షతగాత్రులకు లక్ష్మీనారాయణ పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న లక్ష్మీనారాయణ

తిరుపతి(వైద్యం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం జైభారత్ పార్టీ వ్యవస్థాపకుడు, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసుల తీరు, టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన బాధితులను ఓదార్చి, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

క్షతగాత్రులకు ఆర్థిక సాయం

తిరుపతి(వైద్యం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వారికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో తిరుమలకు చెందిన గుబ్బా చారిటీ నిర్వాహకులు ఆర్థిక సాయం అందించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్,చారిటీనిర్వాహకుడు జీవన్‌కుమార్‌లు శుక్రవారం స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. రూ.25 వేల చొప్పున చెక్కులను అందించారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని తెలిపారు.

యాదవభవన్‌కు రూ.2లక్షల విరాళం


యాదవ సంఘాల ప్రతినిధులతో మంత్రి పార్థసారథి

తిరుపతి అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సామవాయి మాస్టర్‌ప్లాన్ రోడ్డులో నిర్మిస్తున్న వాసుదేవయాదవ్‌భవన్‌కు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి రూ.2లక్షలు విరాళంగా అందించారు. శుక్రవారం ఉదయం ఆయన భవనాన్ని సందర్శించి, యాదవ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నా రామచంద్రయాదవ్, అనిత, చింతా భరణియాదవ్, కట్టా జయరామ్‌యాదవ్, జల్లి తులసియాదవ్, శంకర్‌యాదవ్, ఉదయ్‌యాదవ్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

తిరుపతి (వైద్యం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య సేవలు అందించడంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఫార్మాసిస్టు అసోసియేషన్ క్యాలెండరును ఆయన ఆవిష్కరించారు. ఐక్యంగా పనిచేసినప్పుడే రోగులకు నాణ్యమైన సేవలు అందుతాయని తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అరుణ్ సెల్వకుమార్, జిల్లా కార్యదర్శి నాదముని, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లు మేఘనాథ్ వర్మ, వరలక్ష్మి, బాలరాజు, రమేష్, పార్వతి పాల్గొన్నారు.

ఆపస్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

తిరుపతి(విద్య),జనవరి10:ఆంధ్రప్రదేశ్‌ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని డీఈఓ ఛాంబర్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు తూకివాకం నాగరాజు, సహాధ్యక్షులు సుభాష్ చంద్రదాస్, మురళీరెడ్డి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురస్వామిరెడ్డి, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

కృష్ణయ్యకు స్వాగతం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి పర్యటన కోసం శుక్రవారం తిరుపతికి వచ్చిన ఎంపీ(రాజ్యసభ) ఆర్.కృష్ణయ్యకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. మినర్వా హోటల్లో సీనియర్ నాయకులు జల్లి మధుసూదన్, గుండాల గోపినాథరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, చంద్రబాబుయాదవ్, సుబ్రహ్మణ్యయాదవ్ ఆయన్ను కలిసి సన్మానించారు.

నాగముని మెమోరియల్ లాన్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

తిరుపతి(క్రీడలు), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడా భారతి అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్, ఆఫీసర్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం ఎస్.నాగముని మెమోరియల్ లాన్ టెన్నిస్ టోర్నమెంటు ప్రారంభమైంది. రాయలసీమ జిల్లాలు, నెల్లూరు జిల్లా నుంచి 37జట్లు హాజరయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ టోర్నీలో తొలి రోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. శని, ఆదివారాలలో నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయి. చివరి రోజు విన్నర్, రన్నర్స్ బహుమతులు ప్రదానం చేస్తారు. గ్రూప్ దశలో నిష్క్రమించిన జట్లకు సైతం బహుమతులు అందజేస్తారు. ప్రారంభం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఆర్.గుప్తా, డాక్టర్.సి.రఘునాథరెడ్డి, ప్రొఫెసర్ హనుమంతరావు, డాక్టర్ నజిరుద్దీన్, క్రీడాభారతి సంఘం జిల్లా కార్యదర్శి డి.రవి, చీఫ్‌ప్యాట్రన్ పి.విజయకుమార్‌రెడ్డి, ఆఫీసర్స్ క్లబ్ వర్కింగ్ పెసిడెంట్ మునిమోహనసిద్ధారెడ్డి పాల్గొన్నారు.

మేమూ సాయం చేస్తాం

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు టీటీడీ బోర్డు సభ్యులు వ్యక్తిగతంగా ఆర్థికసాయాన్ని ప్రకటించారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో పాటు సుచిత్ర ఎల్లా రూ.10 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రకటించారు. అలాగే మరో బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు రూ.3 లక్షల చెక్‌ను బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు.

రాజకీయ లబ్ధి కోసమే జగన్ విమర్శలు : టీఎన్‌ఎస్‌ఎఫ్

తొక్కిసలాట ఘటనను మాజీ సీఎం జగన్ రాజకీయ లబ్ధికి వాడుకోవడం బాధాకరమని టీఎన్‌ఎస్‌ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ అన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా ఎన్నో ఘటనల్లో జనం మృత్యువాత పడినా సీఎం హోదాలో జగన్ వెళ్లి పరామర్శించిన పాపాన పోలేదని, ఇప్పుడు ఆగమేఘాల మీద తిరుపతికి వచ్చి రాజకీయాలు మాట్లాడడం దుర్మార్గమని అన్నారు.

ఇన్‌చార్జ్ డీపీటీవోగా నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ ప్రజారవాణాధికారిగా జి.నరసింహులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆ పోస్టులో ఉన్న జగదీష్ చిత్తూరు, తిరుపతి జిల్లాల డీపీటీవోగా పని చేశారు. పని భారం పెరగడంతో తనను చిత్తూరుకే పరిమితం చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు కోరారు. ఈ క్రమంలో తిరుపతికి సీనియర్‌ఆఫీసర్ నరసింహులును ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.

త్వరలో నవోదయం-2కు శ్రీకారం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం),జనవరి10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుడతామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు. పోలీసు అధికారులతో కలసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సారా తయారీ, విక్రయాలు తక్కువగానే ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు ఏడు మండలాల పరిధిలో 17 గ్రామాలను గుర్తించామన్నారు. 22 కేసులు నమోదు చేశామన్నారు. 15 మందిని అరెస్టు చేసి, 2,800 లీటర్ల సారాఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. 80 మంది పాత నేరస్థులపై బీఎన్‌ఎస్‌ఎస్ 129 కింద బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

శివజ్యోతినగర్‌లో చైన్ స్నాచింగ్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివజ్యోతినగర్‌లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలో చైన్ చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. శివజ్యోతినగర్ విజయపురం కాలనీకి చెందిన కల్యాణి స్థానికంగా వాటర్ ప్లాంట్ నడుపుతోంది. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె దుకాణంలో ఉండగా మెడలోని 54 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. హెడ్ కానిస్టేబుల్ రజాక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.




సీబీఎస్‌లో సంక్రాంతి రద్దీ

బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూపులు



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ బస్టాండు శుక్రవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. సంక్రాంతి పర్వదినాలు, వరుస సెలవుల నేపథ్యంలో తిరుపతి కేంద్రంగా ఉన్న వివిధ విద్యాలయాల నుంచి విద్యార్థులు బస్టాండుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కడప, రాయచోటి, మదనపల్లె, పీలేరు, భాకరాపేట, అనంతపురం తదితర నగరాలకు వెళ్లేవారితో నిండిపోయింది. బస్సుల కోసం గంటల కొద్దీ ఎదురుచూడడం కనిపించింది. ఆర్టీసీ యంత్రాంగం అదనపు బస్సులు ఏర్పాటు చేసింది. సీట్లకోసం ప్రయాణికులు బస్సుల వెంబడి పరుగులు తీస్తూ కనిపించారు. బస్టాండులో రద్దీ దృష్ట్యా చాలామంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. సాయంత్రానికి బస్టాండులో రద్దీ కొంతమేర తగ్గుముఖం పట్టింది. చోరీలను అరికట్టేందుకు పోలీసులు, ఆర్టీసీ భద్రతా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఏటీఎం డి.రామచంద్రనాయుడు రద్దీని ఎప్పటికప్పుడు సమీక్షించారు. కాగా వైకుంఠ ఏకాదశి పర్వదినం ఉదయం రద్దీ లేకున్నా, 10గంటల నుంచి బస్టాండులో తిరుమల భక్తుల సందడి కనిపించింది.





తిరుమల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

పరామర్శ పేరుతో పండుగ చేశారు : టీడీపీ

తిరుపతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనను రాజకీయం చేయడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని టీడీపీ నాయకులు వ్యాఖ్యానించారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్లు మధు, కరాటే చంద్ర శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పాపికొండల్లో పడవ మునక ప్రమాదంలో 39 మంది జల సమాధి అయ్యారని, అన్నమయ్య జిల్లాలో డ్యాం తెగి ఊరు పూర్తిగా జల సమాధి అయితే కనీసం జగన్ రెడ్డి పరామర్శకు కూడా వెళ్లలేదన్నారు. ఇప్పుడు ఐసీయూలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శ పేరుతో వేలాదిమందితో వెళ్లి వ్యవహరించిన తీరుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని దుయ్యబట్టారు. నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య, సుధాకర్, వాణి, జయంతి, వెంకటముని, రమేష్, మల్లెల నాగరాజ్ ధనుంజయ, మునిరత్నం రంగయ్యరవి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం పల్లెవీధిలో చోటు చేసుకుంది. వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు..పల్లెవీధికి చెందిన నాగమణి కుమారుడు శ్రావణ్‌కుమార్ రెడ్డి ఇంటర్ వరకు చదువుకున్నాడు. జులాయిగా తిరుగుతూ మత్తుకు బానిసయ్యాడు. మత్తు పదార్థాల అలవాటు నుంచి విముక్తి కోసం మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో మానసిక రుగ్మతలు చుట్టుముట్టాయి. చిల్లర చేష్టలు చేస్తుండడంతో శుక్రవారం నాగమణి గట్టిగా మందలించింది. జీవితంపై విరక్తి చెందిన శ్రావణ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

బీసీ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శిగా సుగుణవతి



తిరుపతి, జనవరి10(ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శిగా సుగుణవతి నియమితులయ్యారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆమెకు కండువా కప్పి ఈ మేరకు ప్రకటించారు. సుగుణవతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం, వారి హక్కుల కోసం పోరాటం చేస్తానని చెప్పారు. ముఖ్యంగా మహిళల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు


స్పీకర్ అయ్యన్నపాత్రుడు


రఘురామకృష్ణరాజు


నిమ్మల రామానాయుడు


హోం మంత్రి అనిత


రామ్మోహన్‌నాయుడు


చాముండేశ్వరీనాథ్, పుల్లెల గోపీచంద్

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వారిలో.. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రాష్ట్ర మంత్రులు అనిత, సంధ్యారాణి, కొలుసు పార్థసారధి, నిమ్మల రామానాయుడు, సవిత, శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ రెడ్డి, గుమ్మనూరు జయరాం, బొజ్జల సుధీర్ రెడ్డి, ఆదిమూలం, జగన్మోహన్, మురళిమోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, శ్రీకృష్ణదేవరాయులు, మిధున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, కంచర్ల శ్రీకాంత్, కల్యాణి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి రామకృష్ణ, సుహాసిని, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే, సినీ నటుడులు రాజేంద్రప్రసాద్, సప్తగిరి, నిర్మాత బండ్ల గణేష్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, ఇండియన్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఉన్నారు.



ఇల వైకుంఠం

- పుష్ప, విద్యుత్ అలంకరణలతో కనువిందుగా కొండ











శ్రీవారి ఆలయంలో దాదాపు 5 టన్నులు.. వెలుపల మరో 5 టన్నుల పుష్పాలు.. 1.20 లక్షల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణలే. విద్యుద్దీపాలంకరణలతో తిరుమల 'ఇల వైకుంఠం'గా మారింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మనసుదోచే విద్యుత్, పుష్పాలంకరణలో స్వామి కొండను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. శ్రీవారి ఆలయం ముందు వేసిన 'రంగనాథ స్వామి ఆలయ' సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి దర్శనం అనంతరం భక్తులందరూ ఈ సెట్టింగ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్నారు. పూలు, పండ్లతో చేసిన దేవతల అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈసారి మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో అలంకరణలు చేపట్టడంతో భక్తులు నూతన అనుభూతులను పొందుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహావిష్ణువు, శ్రీలక్ష్మీదేవి, గరుడ ఇతర దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు, సప్తగిరి వద్ద విద్యుత్ సప్త ద్వారాలు కూడా శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తొలిరోజు ప్రశాంతంగా..



- శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు
- స్వర్ణరథంపై ఊరేగిన స్వామివారు.. నేడు చక్రస్నానం

తిరుమల, జనవరి10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులతో తిరుమల కొండ సందడిగా మారింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను వేకువజామున 4.30 గంటలకు మొదలుపెట్టాలని అనుకున్నప్పటికీ.. ధనుర్మాసం కైంకర్యాలు కైంకర్యాలు త్వరగా పూర్తికావడంతో 3.50 గంటలకే దర్శనాలు మొదలయ్యాయి. ఉదయం 8.15 గంటల వరకు సుప్రీం, వివిధ రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులకు దర్శనం చేయించారు. ఆ తర్వాత టోకెన్లు పొందిన సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ల వారీగా దర్శనం చేయిస్తామన్నారు. ఇక, శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంలో వేంచేపు చేసి ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథాన్ని టీటీడీ మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మహిళలు లాగారు.

మిగిలిపోయిన గదులు?

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పద్మావతి పరిధిలోని వందకుపైగా గదులు మిగిలిపోయినట్టు తెలిసింది. సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజు గదుల పొందాలంటే శ్రీవారి దర్శనాని కంటే కష్టంగా భావిస్తారు. అలాంటిది శుక్రవారం ఏకంగా దాదాపు వంద గదులు ఎలాంటి కేటాయింపులు లేకుండా ఉండిపోయినట్టు సమాచారం. వివిధ రకాల ప్రముఖుల కోసం వీటిని ఎవరికి కేటాయించకుండా వదిలేసినట్టు తెలిసింది. మరోవైపు గదులు లభించక చాలా మంది భక్తులు తీవ్రమైన చలిలో ఉండిపోయారు. కనీసం వారికైనా వీటిని కేటాయించి ఉంటే బాగుండేదంటూ పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు.

ఇబ్బంది పెట్టిన గేట్లు

శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసిన గేట్లతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఒకచోటు నుంచి మరోచోటికి వెళ్లేందుకు అవస్థ పడ్డారు. స్వర్ణరథం నిర్వహించే సమయంలో అక్కడక్కగా గేట్లను మూసివేయడంతో పిల్లలతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. వృద్ధులు, మహిళలు కూడా గేట్లను ఎక్కిదూకుతూ కనిపించారు. తిరుమలలో చలి భక్తులను గజగజ వణికించింది. శుక్రవారం మొత్తం ఎండ లేకపోవడంతో పాటు పొగమంచు ఉక్కిరిబిక్కిరి చేసింది.

రేపు తిరుపతికి సీఎం

- నాలుగు రోజులు జిల్లాలో ఉండనున్న చంద్రబాబు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుచానూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం పర్యటించే ప్రాంతాలను తనిఖీ చేశారు. తాజ్ హోటల్‌లో పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా అప్రమత్తంగా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, నగరపాలక కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో రామమోహన్ పాల్గొన్నారు. కాగా, ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు.. నాలుగు రోజులపాటు జిల్లాలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుచానూరు ముఖద్వారం (బనీన్ ఫ్యాక్టరీ) సమీపంలో శంకర్‌రెడ్డి నివాసంలో ఏజీఅండ్‌పీ గ్యాస్ సంస్థ ఇంటింటికి ఏర్పాటు చేసిన గ్యాస్ కనెక్షన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం 2.20 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుని, ఏజీ అండ్‌పీ గ్యాస్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక్కడి వరకు అధికారనిక పర్యటన ఖరారైంది. కాగా, సాయంత్రం నారావారిపల్లెకు చేరుకుని పండుగ సందర్భంగా 13, 14, 15 తేదీల్లో చంద్రబాబు అక్కడే ఉంటారు. 15వ తేదీన మధ్యాహ్నం తిరుగు ప్రయాణమవుతారని అధికారులు వెల్లడించారు.

స్వగ్రామాలకు 32 మంది



వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటలో గాయపడిన వారిలో 32 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. వారికి అధికారులు శ్రీవారి దర్శనం చేయించి ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు పంపారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఫొటో దిగారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ పోరాటాలు



మీడియాతో మాట్లాడుతున్న కృష్ణయ్య

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జనవరి 10(ఆంధ్రజ్యోతి): బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరికి న్యాయం చేయడానికి గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. శనివారం తిరుచానూరులోని ఎస్ఎస్‌టీ కల్యాణ మండపంలో జరిగే ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ 19వ మహాసభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జల్లి మధుసూదన్, నూకాలమ్మ, జగన్నాథం, సుగుణపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై విచారణ

- క్యూలైన్ల వద్ద ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై ప్రభుత్వం సీరియస్


క్యూలైన్ల వద్ద కానరాని వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే కారణంతో ప్రభుత్వం ఆ శాఖ అధికారులను వివరణ కోరినట్లు సమాచారం. గాయపడిన వారికి సకాలంలో వైద్య సాయం అందలేదని, ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్సు కూడా అందుబాటులో లేదని అధికారుల విచారణలో తేలింది. సాధారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు చేరే ప్రదేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలి. తప్పక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా అంబులెన్సులను అందుబాటులో ఉంచాలి. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడం, డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్లే ప్రాణనష్టం జరిగిందని అధికారుల విచారణలో తేలడంతో ఇందుకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.

షికారీల భూసమస్యను పరిష్కరించండి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ఏర్పేడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెం పంచాయతీ మరాఠీపురం షికారీ కాలనీకి చెందిన షికారీల భూ సమస్యను పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు డాక్టర్ హేస్సేన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 1979లో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో తమకు ఒక్కో కుటుంబానికి 5 ఎకరాలు చొప్పున 120 కుటుంబాలకు అందించారని షికారీల ఉద్యమనేత పరశునాథ్ చెప్పారు.20ఏళ్ల క్రితం పొట్ట కూటి కోసం పట్టణాలకు వలస వెళ్లామన్నారు. అదేదను గా భావించిన కొంతమంది రైతులు తమ భూములను ఆక్రమించుకున్నారన్నారు షికారీల భూ సమస్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వారికి న్యాయం చేయాలని హుస్సేన్ ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, గ్రామ రెవెన్యూ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీ ఎస్టీ కమిషన్ సభ్యుడు

పుత్తూరు వార్తలు

గృహావసరాల సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో

- అందుబాటులోకి హోం ట్రయాంగిల్ యాప్
- సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను సద్వినియోగం చేసుకోండి
- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్


సమావేశంలో ప్రసంగిస్తున్న మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గృహావసరాలకు ఆన్‌లైన్ సేవలను ప్రభుత్వం సులభతరం చేసిందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. ఇందుకు హోం ట్రయాంగిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త, జీవనోపాధి అన్న నినాదంతో 'సర్వీస్ ప్రొవైడర్స్ మేళా'ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, బార్బర్, ఏసీ, వాషింగ్ మెషిన్, టీవీ, గీజర్, వాటర్ ప్యూరిఫయర్ మరమ్మతులను ఈ యాప్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే బ్యూటీషియన్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో నమోదు చేసుకోవడానికి మెప్మా ఆధ్వర్యంలో జరిగిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళాకు వంద మందికి పైగా యువత హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి శిక్షణ ఇవ్వడమే కాకుండా, 2 జతలు యూనిఫాం, డిజిటల్ ఐడీ కార్డు అందిస్తారన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, వ్యక్తిగత ఫొటోతో ఈనెల 18వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో ఈనెల 11న శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ జయసాయి పేర్కొన్నారు. 132 కేవీ సబ్ స్టేషన్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల మీద పడిన చెట్ల కొమ్మల కత్తిరింపులను చేపడుతుండడంతో సరఫరా ఉండదన్నారు.

చిత్తూరులో టీడీఆర్ బాండ్ల విచారణకు పుత్తూరు టౌన్‌ప్లానింగ్ అధికారి



పుత్తూరు అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తరహాలో చిత్తూరు మున్సిపాలిటీలో కూడా టీడీఆర్ బాండ్ల అవినీతిపై ఆ శాఖ విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించింది. అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పుత్తూరు పట్టణ ప్రణాళిక విభాగ అధికారి నీరజాక్షికి విచారణ బృందంలో సభ్యురాలిగా చేర్చారు.

రెవెన్యూ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



పుత్తూరు అర్బన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం రేపల్లెలోని ఆయన నివాసంలో విజయ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి


గూడూరులో కోదండరామాంజనేయస్వామి గ్రామోత్సవం


తడలో గోపూజ


కోటలో పూజలు అందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ రాజస్వామి





సూళ్లూరుపేట: గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు - నాయుడుపేట: భీమవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు

గూడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే ప్రజలు ఆలయాలకు చేరుకుని ఉత్తరద్వారం నుంచి స్వామివార్లను దర్శించుకున్నారు. గూడూరులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి, కోదండ రామాంజనేయస్వామి, ఆళఘునాధస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. పలు ఆలయాల్లో స్వామివార్లను ప్రత్యేకంగా గరుడ వాహనంపై గ్రామోత్సవాలు నిర్వహించారు.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయంలో స్వామివారిని భక్తుల దర్శనార్థం గరుడ వాహనంపై అలంకరించారు. ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు.

నాయుడుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు వేదపారాయణం, 6.30 గంటలకు గరుడ వాహన సేవ నిర్వహించారు. రాజగోపుర ద్వార దర్శనంలో కరిమాణిక్య స్వామి దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ తన స్వగ్రామమైన నాయుడుపేట మండలం భీమవరంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా తన మొదటి జీతంలో రూ.50వేలను ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృతసరళ దంపతులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం సూళ్లూరుపేటలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మద్వేంకటరామ్మూర్తి స్వామి ఆలయం, శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి, బాలాంజనేయస్వామి, పాండురంగ స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజ వైభవంగా జరిగాయి. మన్నారుపోలూరు సత్యా జాంబవతీ అలఘుమల్లారి కృష్ణస్వామి ఆలయంలో పూలతో అలంకరించి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అలాగే మన్నారుపోలూరులో ప్రాచీన కాలంనాటి మన్నారుకృష్ణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి ఏడుకలు జరిగాయి. ఉదయం స్వామిని గరుడవాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ఉత్తర దిక్కున నిలిపి, ఉత్తరద్వార దర్శనాలకు భక్తులను అనుమతించారు.

తడ(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం, చేనిగుంటలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయం, చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయాల్లో ముక్కోటి సందర్భంగా ప్రత్యేక పూజలు, గోపూజ చేశారు. అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం వ్యవస్థాపకులు తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, టీడీపీ నాయకుడు వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని భూదేవి, శ్రీదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ప్రధానార్చకులు ఉదయగిరి ఆదిశేషాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గూడలి పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా కోటలోని వైకుంఠ రాజస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రముఖ వ్యాపారవేత్త గ్రంథం శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. అదే విధంగా గోవిందపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, శ్రీలక్ష్మమ్మకాలనీ, చిట్టేడు, వంజివాక, గ్రామాల్లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలలో వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరహర క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను కన్నుల పండవగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పురవీధుల్లో గరుడ వాహనపై స్వామివారి ఊరేగించారు.

చిట్టమూరు(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని కొత్తగుంట, ఆరూరు, కోగిలి, సోమసముద్రం గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి.స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.




సూళ్లూరుపేట: మన్నారుపోలూరులోని మన్నారు కృష్ణస్వామి - వెంకటగిరి టౌన్: గరుడ వాహనంపై వైకుంఠవాసుడు - చిల్లకూరులో లక్ష్మీనరసింహస్వామి, గూడూరులో కోదండ రామాంజనేయస్వామి

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


లోకేష్ మృతదేహం

వాకాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్రతీరంలో గల్లంతైన విద్యార్థి మామిడి లోకేష్(17) మృతదేహం శుక్రవారం సాయంత్రం లభ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... వాకాడు మండలం వైట్‌కుప్పం గ్రామానికి చెందిన విద్యార్థి మామిడి లోకేష్ స్నేహితులతో కలసి గురువారం సముద్ర స్నానానికి వెళ్లిన విషయం విధితమే. ఇద్దరు విద్యార్థులు సముద్రంలో అలల తాకిడికి కొట్టుకుపోగా మత్స్యకారులు, మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం నుంచి సముద్రతీరంలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 6 గంటలకు ఓ మృతదేహం నీటిపై తేలియాడుతూ ఒడ్డుకు చేరుకోగా అది లోకేష్‌గా గుర్తించారు. నెల్లూరు జిల్లా కావలి ప్రాంతం బంగారుపాళెం గ్రామానికి చెందిన కొండయ్య, రేఖ దంపతుల కుమారుడు లోకేష్ వాకాడు మండలం వైట్‌కుప్పం గ్రామంలో తన మేనమామ కుమార్ వద్ద ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు




పుత్తూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, కేకేసీ హోమియో వైద్యకళాశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆయా కళాశాలల్లో సంక్రాంతి సంస్కృతిని ప్రతిబింబించే రంగవల్లులు, గొబ్బెమ్మలు, కోలాటాలు, భోగిమంటలు, సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు. సంక్రాంతి పండుగ వైభవాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి వివరించారు. పాలిటెక్నిక్‌లో అధ్యాపకులు, సిబ్బంది మధ్య టగ్ ఆఫ్ వార్ జరిగింది. హోమియో వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ శరవణన్ ఆధ్వర్యంలో మహిళలు చెరుకు గడల పందిట్లో పొంగళ్లను పెట్టారు.

వైకుంఠ ద్వార దర్శనం పులకించిన భక్త జనం



వడమాలపేట, జనవరి 10(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. టీటీడీ అధికారులు వైకుంఠ ద్వారం ఏర్పాటు చేయగా భక్తులు ప్రవేశించి తన్మయత్వం చెందారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు వేకువజామున తిరుప్పావై పాశురాలను పఠించారు. నిత్యకైంకర్యాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయదేవేరులతో వేంకటేశ్వరుడు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

మరణంలోనూ వీడని బంధం

భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య మృతి


సుబ్బరామయ్య, శేషమ్మ (ఫైల్‌ఫొటోలు)

కోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీవితాంతం కలిసి ఉంటామంటూ వివాహ బంధంతో ఒక్కటైన జంట కాటికెళ్లే సమయంలో కలిసే ప్రయాణించిన విషాద ఘటన కోట మండలం తిన్నెలపూడి దళితవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని తిన్నెలపూడి దళితవాడకు చెందిన మన్నె సుబ్బరామయ్య(80), శేషమ్మ(75) దంపతులకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు ఆర్టీసీలో కండక్టర్. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బరామయ్య గురువారం స్వగ్రామమైన తిన్నెలపూడిలో మృతి చెందాడు. శుక్రవారం దహనక్రియలు నిర్వహిస్తుండగా భర్త మృతదేహంపై పడి భార్య శేషమ్మ బోరున విలపిస్తూ అశువులు బాసింది. ఈ ఘటన బంధువులు, గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య ఒకేసారి భార్యభర్తల మృత దేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

నేల బావిలో పడి రైతు మృతి


సురేష్ మృతదేహం

చిట్టమూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పుచ్చ చెట్లకు పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లిన వంకా సురేష్(44) నేల బావిలో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... మండల పరిధిలోని మొలకలపూడి గ్రామానికి చెందిన సురేష్ గురువారం పుచ్చ చెట్లకు పురుగు మందు పిచికారీ చేసేందుకు పొలాల్లోకి వెళ్లాడు. నేల బావిలో నీళ్లు తెచ్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయి మృతి చెందాడు. సాయంత్రం అయినా సురేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఎక్కడా కనిపించలేదు. శుక్రవారం నేల బావి దగ్గరకు వెళ్లి చూడగా నీళ్లలో పడి మృతి చెంది ఉండ డాన్ని గమనించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మప్రియ

వరదయ్యపాళెం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎలు అంశాలపై చర్చించారు. పలు శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. కాగా సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. కేవలం 10మంది సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు రాజశేఖర్, వ్యవసాయాధికారి గౌరి పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజా సంక్షేమం: ఆదిమూలం



మినీ గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని పాలమంగళం హెచ్‌డబ్ల్యూలో నిర్మించిన నూతన మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నామని చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, టీడీపీ నాయుకులు భాస్కరన్, ఢిల్లీ, భాస్కర్, సురేష్ సుబ్రమణ్యం, అంబికమ్మ, ఎంపీడీవో శేఖర్, ఏపీవో, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మ పుర విహారం



శ్రీకాళహస్తి జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా గొబ్బెమ్మ (మనోన్మణి) ఉత్సవం జరిగింది. ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. మేళతాళలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. భక్తుల అమ్మవారికి కర్పూర నీరజనాలు సమర్పించారు.

ముక్కంటికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో శ్రీకాళహస్తీ శ్వరుడు, జ్ఞానప్రసూనాంబ ఉత్సవర్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనం తరం ప్రత్యేకంగా అలంకరించి వేదమం త్రాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని శేషవాహనం, అమ్మ వారిని యాళి వాహనంపై అధిష్ఠింప జేశారు. స్వామిఅమ్మవార్లు పట్టణంలో విహరిస్తూ భక్తులపై వరాల జల్లు కురిపించారు.

ప్యాకెట్ క్యాలెండర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురం ప్రసన్న వెంకన్న ఆలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో ప్యాకెట్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు కందాటి విశ్వేశ్వరరెడ్డి, చెంచయ్యనాయుడు, విష్ణుకుమార్‌రెడ్డి, కందాటి లక్ష్మీకాంతమ్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నూతన గోకులాలు ప్రారంభం



రేణిగుంట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 11 నూతన గోకులాలను శుక్రవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద పాడి రైతుల కోసం 22 పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.44 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే సుధీర్ ఆదేశాలతో ఈ షెడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో పూర్తయిన 11 షెడ్లను పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీవో జ్యోతిశ్రీ, పశువైద్యాధికారి రెడ్డెప్పరెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు.

అల్లిమెట్టలో మురుగు కాలువ నిర్మాణం



రేణిగుంట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని అల్లిమిట్టలో మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇరవై ఏళ్లుగా ఈ ప్రాంతంలో మురుగు నీటి కాలువ నిర్మాణానికి నోచుకోలేదు. ఎమ్మెల్యే సుధీర్ చొరవతో మండల నిధులు రూ.4.50 లక్షలతో ఈ కాలువ నిర్మాణ పనులను చేపట్టారు.

మతమార్పిడులపై చర్యలు తీసుకోండి

రేణిగుంట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదళ్లచెరువులో మతమర్పిడులను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు సురేష్‌బాబుకు శుక్రవారం గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి బాగు చేస్తామని చెప్పి మతం మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీంతో కుటుంబాల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయని, ఈ విషయమై పాస్టర్‌తోమ చర్చించినట్టు తెలిపారు. అయితే చర్చించడాన్ని తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఖండించారు.

ట్రాక్టర్, లారీ ఢీ: తప్పిన ప్రమాదం

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటన శుక్రవారం తొట్టంబేడు మండలంలోని కన్నలి ఎస్టీకాలనీ వద్ద జరిగింది. ట్రాక్టర్, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ట్రాలీ ఊడి దూరంగా పడింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. దెబ్బతిన్న వాహనాలను పక్కకు తీసి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా రెండో పట్టణ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సిటిజన్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు అన్నారు. సిటిజన్‌వెల్ఫేర్‌ఫోరం, యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం శుక్రవారం పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్, 1వ పట్టణ సీఐ గోపికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా భోగిపండగలో హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు వంటివి వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చెర్లోపల్లి వద్ద జరిగింది. కేవీవబీపురానికి చెందిన అనిల్‌కు సొంతమైన లగేజీ వాహనానికి తొండమనాడుకు చెందిన వినయ్ క్లీనర్. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలో బాడుగను ముగించుకుని తొండమనాడుకు బయలుదేరారు. మార్గమధ్యంలో చెర్లోపల్లి వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించబోయే క్రమంలో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌గా ఉన్న అనిల్ స్వల్పగాయలతో బయటపడ్డాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించి కేసు నమోదు చేశారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం అప్పగించారు. వినయ్‌కు భార్య శిరీష, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదు

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని అధికారులు తెలిపారు. వరుస పండుగల నేపథ్యంలో విద్యుత్ లైన్ల నెలవారీ మరమ్మతు పనులను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

వైకుంఠవాసా... గోవిందా



నారాయణవనంలో తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న- విశేషాలంకారంలో ముక్కంటి ఆలయంలోని వేంకటేశ్వరస్వామి - విశేషాలంకారంలో వరదరాజస్వామి - స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

నారాయణవనం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు వేకువజామున తిరుప్పావై ప్రవచాలను పఠించారు. అర్చకులు నిత్యకైంకర్యాలను నిర్వహించి, భక్తులను దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు తిరుచ్చి వాహనం అధిరోహించి సంపంగి ప్రాకారంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేల కర్పూర నీరజనాలు సమర్పించారు. ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు వైకుంఠ వాకిలి ప్రవేశం

ఏకాదశి మరుసటి రోజు, శనివారం ద్వాదశి రోజున వైకుంఠ వాకిలి ప్రవేశం ఉంటుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు ఆలయంలోని ఉత్తర ముఖ ద్వారంలో భక్తులను అనుమతిస్తామని తెలిపారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామికి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

● శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వరదరాజ స్వామి ఆలయంలో బాలాలయం ఉన్నప్పటికీ ఆలయ అధికారులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఇతర ఏర్పాట్లు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామిఅమ్మవార్లు గరుడవాహనంపై పట్టణంలో విహరించారు. తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఊరందూరులో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

రేణిగుంట(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంచి నీళ్లగుంట సమీపంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారంలో భక్తులను అనుమతించారు. ఆలయ ఆవరణలో శేష వాహనంపై సర్వాలంకారభూతుడై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లిలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనాథుడి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ ధర్మకర్త కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వారా దర్శనాన్ని కల్పించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల పురవిహారం జరిగింది. అనంతరం ప్రసాద వినియోగం జరిగింది. గవర్ల కృష్ణయ్య, కోలా గోవర్ధన్, కోలా విశాలక్షి, నందకుమార్, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం, మునీంద్ర పాల్గొన్నారు.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. అన్నమయ్య, త్యాగరాజ కీర్తనల కచ్చేరి జరిగింది.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. స్వామివారి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



కేవీబీపురంలో స్వామిఅమ్మవార్ల ఊరేగింపు - రేణిగుంట పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శేషవాహనంపై దేవేరులతో మలయప్ప - వరదయ్యపాళెం పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



ప్రత్యేక అలంకారంలో సంతాన సంపద వేంకటేశ్వరస్వామి

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో శుక్రవారం శ్రీవేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్ రీసెర్చ్, టాటా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము, నోరు, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి నగరంలోని అలిపిరి పార్కు సమీపంలో ఉన్న స్వీకార్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యసేవలను అందిస్తుందని ప్రోగ్రాం కోఆర్డినేటర్ రెడ్డి కుమారి తెలిపారు.

తారురోడ్డుకు మరమ్మతులు



పంగూరు నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే మార్గంలో గుంతలను పూడ్చుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

ఏర్పేడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తారురోడ్లలో గుంతలకు జోరుగా మరమ్మతులు చేపడుతున్నారు. పంగూరు నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే మార్గంలో గుంతలను శుక్రవారం తారు మిక్సర్ వేసి పూడ్చారు. ఈ పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రమీల, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురగయ్య నాయుడు పర్యవేక్షించారు.

వైద్య శిబిరం

ఏర్పేడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెం వద్ద ఉన్న సీఎంఆర్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200మంది ప్రజలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ బాలప్రసాద్‌యాదవ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని నేతాజీ కళావేదిక ఆర్గనైజర్ భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూవీధిలో ఉన్న శ్రీరాముల వారి ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 2గంటలకు సంక్రాంతి సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. పలుసాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయరామయ్య, రామచంద్రయ్య, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



దర్శనానంతరం ఆలయ ధ్వజ స్తంభం వద్ద నందమూరి రామకృష్ణ - విశ్వేశ్వరరావు కుటుంబసభ్యులు - ఎమ్మెల్సీ చిరంజీవి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మన జయకృష్ణ కుటుంబీకులు

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. నవయుగ సంస్థ అధినేత చింత విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యులు, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారికి ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగినేని చెంచయ్యనాయుడు, శ్రీనివాసులురెడ్డి, హరిబాబు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మన జయకృష్ణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, వైజాగ్ ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్, యర్రగొండపాళెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ తదితరులు కూడా దర్శించుకున్నారు.



ఆలయ ధ్వజ స్తంభం వద్ద తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్, వైజాగ్ ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్, యర్రగొండపాళెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ తదితరులు

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాలనవనంలో ఉన్న విశ్వభారతి ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. చిన్నారులకు ఉపాధ్యాయులు భోగిపండ్లను పోశారు. కరస్పాండెంట్ శోభ సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన జనసేన నేత కోట వినుత

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యాయస్థానంలో వాయిదాలకు శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు హాజరయ్యారు. ఆమెమాట్లాడుతూ గత ప్రభుత్వం తమపై 17 అక్రమ కేసులు బనాయించిందన్నారు. అందులో భాగంగా తాము కోర్టుకు హాజరయ్యామన్నారు.

నేడు మినీ గోకులం షెడ్ ప్రారంభం

శ్రీకాళహస్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో మినీ గోకులంషెడ్‌ను ఎమ్మెల్యే సుధీర్ ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తారని పేర్కొంది. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి

వరదయ్యపాళెం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరదవాడ, కళత్తూరు, సీఎల్ఎన్‌పల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ పంట నమోదు, రైతు ఈకేవైసీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో గౌరి మాట్లాడుతూ పంట పరిస్థితులు, ధాన్యం మార్కెట్ ధర గురించి చర్చించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం త్వరలో అందుబాటులోకి తీసుకువస్తుందని, రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే పంట నమోదు చేసుకోవాలన్నారు.